
08-05-2025
గురువారం
మల్కాజిగిరి
jayabherinews
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 224 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
జయభేరి

# ఎప్పుడు? ఎక్కడ? ఎలా?

## ఆపరేషన్ సిందూర్ వీడియోలు రిలీజ్ చేసిన భారత్ ఆర్మీ



2 లో

జయభేరి, న్యూఢిల్లీ, మే 7:

పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన 15 రోజుల తర్వాత, భారత సైన్యం తన శక్తిని ప్రదర్శించి, ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ వైమానిక దాడిలో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మసూద్ అజార్ కుటుంబం, సన్నిహితులు సహా అనేక మంది ఉగ్రవాదులు మరణించారు. భారత ప్రభుత్వం బుధవారం ఆపరేషన్ సిందూర్ వీడియో, ఫోటోగ్రాఫిక్ ఆధారాలను విడుదల చేసింది.సైనిక అధికారులు ఉగ్రవాద స్థావరాలపై దాడికి సంబంధించిన క్లిప్‌లను కూడా చూపించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి బాధితులకు న్యాయం చేయడానికి ఆపరేషన్ సిందూర్ ప్రారంభించినట్టు కల్నల్ సోఫియా ఖురేషి తెలిపారు. తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని నాశనం చేశారు. గత మూడు దశాబ్దాలుగా పాకిస్తాన్‌లో ఉగ్రవాదులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇవి పాకిస్తాన్, పీఓకే రెండింటిలోనూ విస్తరించి ఉన్నాయి.



2 లో

# ఆపరేషన్ సిందూర్

## పోలీసులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు

**దేశ భద్రతా బలగాలు ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్మీ, పోలీసు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర అత్యవసర విభాగాలతో తాజా పరిణామాలను సమీక్షించిన ముఖ్యమంత్రి ఇలాంటి సందర్భాల్లో తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.**

**భారత సైనిక బలగాలకు సంఘీభావంగా, అండగా ఉన్నామని సందేశం ఇవ్వడానికి తెలంగాణ ప్రజల తరపున సాయంత్రం 6 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు. "తీవ్రవాద వ్యతిరేక పోరాటాలకు సంఘీభావ ప్రకటన" గా ఈ ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు.**

జయభేరి, హైదరాబాద్ :

దేశ సైన్యంతో మనమంతా అండగా ఉన్నామనే సందేశం ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమయంలో రాజకీయాలు, పార్టీలకు తావులేదని స్పష్టం చేశారు. అత్యవసర సర్వీస్‌లు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తున్నామని ప్రకటించారు. ఉద్యోగులు అంతా ప్రభుత్వానికి అందుబాటులో ఉండాలని చెప్పారు. మంత్రులు, అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. బుధవారం ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆపరేషన్ సిందూర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎస్, డీజీపీలతో పాటు అందుబాటులో ఉన్న మిలిటరీ అధికారులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల రక్షణకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు.

# జై హింద్.. జై మోడీ


జయభేరి, హైదరాబాద్, మే 7:

భారత్ భూభాగంలోకి చొరబడి ఘాతుకాలకు పాల్పడితే... తమ ప్రజల ప్రాణాలు హరిస్తే... చూస్తూ ఊరుకునేది లేదని ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సింధూర్'తో ప్రపంచానికి చాలా స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. పహల్గాం ఉగ్రదాడికి ధీటుగా బదులు ఇచ్చింది. మంగళవారం అర్ధరాత్రి తర్వాత భూభాగంలోని తొమ్మిది తీవ్రవాద స్థావరాలపై దాడి చేసింది. దీనిపై సినిమా సెలబ్రిటీలు హర్షం వ్యక్తం చేశారు. మోడీకి మద్దతుగా దేశానికి అండగా నిలబడతామంటూ ట్వీట్లు చేశారు. 'ఆపరేషన్ సింధూర్' మీద టాలీవుడ్ సెలబ్రిటీల రియాక్షన్స్ చూడండి.



**యోధుడి యుద్ధం మొదలైంది.. రజనీ**

'ఆపరేషన్ సింధూర్' తర్వాత సూపర్ స్టార్ రజనీకాంత్ సోషల్ మీడియా వేదికగా తన స్పందన తెలియజేశారు. యోధుడి యుద్ధం మొదలైందని ఆయన పేర్కొన్నారు. లక్ష్యం పూర్తయ్యే వరకు ఈ యుద్ధం ఆగదు అని రజని వివరించారు. ప్రధాని మోడీకి, హోం మంత్రిత్వ శాఖ వెంట దేశం మొత్తం నిలబడుతుందని ఆయన తెలిపారు.



**జైహింద్... మెగాస్టార్ చిరంజీవి**

'ఆపరేషన్ సింధూర్' తర్వాత స్పందించిన తొలి టాలీవుడ్ సెలబ్రిటీ మెగాస్టార్ చిరంజీవి. జైహింద్ అంటూ సోషల్ మీడియాలో ఆయన ఒక ట్వీట్ చేశారు. 'ఆపరేషన్ సింధూర్' ఫోటో యాడ్ చేశారు. 'భారత్ మాతాకీ జై... జైహింద్' అంటూ సీనియర్ హీరోయిన్ ఖుష్బూ కూడా ట్వీట్ చేశారు.



**ఇండియన్ ఆర్మీ సేఫ్టీగా ఉండాలి.. ఎన్టీఆర్**

'ఆపరేషన్ సింధూర్' పట్ల మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ 'జై హింద్' అని సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు. భారత ఆర్మీ సురక్షితంగా, శక్తివంతంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మనదేశ త్రివిధ దళాలకు మరింత శక్తివంతంగా ఉండాలని కోరుకుంటున్నట్లు నందమూరి కళ్యాణ్ రామ్ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ధీటైన సమాధానం ఆపరేషన్ సింధూరం ద్వారా ఇచ్చారని తెలిపారు.



**న్యాయం జరిగిందన్న బన్నీ... సహించేది లేదన్న సాయి దుర్గా తేజ్!**

'ఆపరేషన్ సింధూర్' ద్వారా న్యాయం జరిగిందని అల్లు అర్జున్ ట్వీట్ చేయగా... అసలు సహించేది లేదని సాయి దుర్గా తేజ్ ట్వీట్ చేశారు. ఇండియన్ ఆర్మీకి యువ హీరో సుధీర్ బాబు సెల్యూట్ చేశారు. దేశ సైనికుల ధైర్య సాహసాలను చెప్పేందుకు 'ఆపరేషన్ సింధూర్' ఒక ఉదాహరణ అన్నారు. భారత్ భూభాగం మీద తీవ్రవాదానికి చోటు లేదని ఆయన పేర్కొన్నారు. భారత గౌరవాన్ని మరింత నిలబెట్టిన సైనికులకు సెల్యూట్ చేయడంతో పాటు జైహింద్ అని పేర్కొన్నారు.

# ఆపరేషన్ సింధూర్

■ రాష్ట్రపతికి వివరించిన ప్రధాని



జయభేరి, న్యూఢిల్లీ, మే 7:

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి భారత్.. పాకిస్తాన్ పై ప్రతీకారం తీర్చుకుంది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో 30మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. దాదాపు 100 మంది మరణించినట్లు సమాచారం.. పాకిస్తాన్‌లో 4, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో 5.. మొత్తం తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ఇండియన్ ఆర్మీ నేలమట్టం చేసింది. మిస్సైళ్ల వర్షం కురిపించి.. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ అనంతరం తాజా పరిస్థితులపై ప్రధాని మోదీ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది

...మిగతాది 2 లో

## ఆపరేషన్ సింధూర్ పై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

జయభేరి, హైదరాబాద్:



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆపరేషన్ సింధూర్ పై స్పందించారు. భారత సైన్యం ప్రదర్శించిన తన సైనిక పాటవానికి ఒక భారతీయుడుగా గర్వపడుతున్నా. ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో వున్నా.. ఏ దేశంలో వున్నా.. ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే. ఉగ్రవాదం అంతం కావాల్సిందే.. ఈ విషయంలో పాజిటివ్గా ఆలోచించే ప్రపంచ శక్తులు ఏకమవ్వాలి. ఉగ్రవాదాన్ని పూర్తిగా అంతమొందిస్తేనే.. శాంతి సామరస్యాలు నెలకొంటాయి. భారత సైన్యం ఎంత విరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా ఉండాలి . దేశరక్షణలో మేము ఎవరికీ తీసిపోము అన్నట్టుగా.. వారికి శక్తి సామర్థ్యాలు ఉండాలని ప్రార్థిస్తున్నానని అన్నారు.

## గాంధీ మార్గంలో నడిచినందుకే మన దేశానికి ఈ గతి పట్టింది



జయభేరి, హైదరాబాద్, మే 7:

పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ చూపిన శాంతి, అహింస మార్గంలో నడుస్తూ, శాంతి మంత్రం జపించినందుకే భారత్‌కు ఈరోజు ఈ గతి పట్టిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. 1990 నుంచి కాశ్మీర్ పండిట్లను చంపడం నుంచి వారి అరాచకాలు పెరిగాయి. అంత్యక్రియలు చేయడానికి తీసుకెళ్తే.. అక్కడ సైతం మారణహోమం చేసి హిందువులను చంపేశారని పేర్కొన్నారు. ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో లో ఏపీకి చెందిన ఇద్దరు చనిపోయారు. చంపే ముందు వారిని మీరు హిందువులా కాదా అని అడిగి మారణహోమం చేశారని పవన్ కళ్యాణ్ అన్నారు. పాక్ ఉగ్రవాదులపై భారత ఆర్మీ చేపట్టిన చర్యలు ఇంకా కొనసాగుతాయన్నారు.హైదరాబాద్‌లో బాంబు దాడులు జరిగినా దాని మూలాలు పాకిస్తాన్ లో ఉంటున్నాయి. కశ్మీర్ లోనే కాదు దేశంలో ప్రతిచోట జరిగే ఉగ్రదాడులకు పాక్ టెర్రరిస్ట్ సంస్థలే కారణం.

...మిగతాది 2 లో

## ఐఏఎస్ శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టు గట్టి షాక్




జయభేరి, హైదరాబాద్, మే 7:

ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి ఓబులాపురం కేసు నుంచి బయటపడ్డారని అనుకున్నారు. కానీ ఈ కేసులో శిక్షలు ఖరారు అయిన తరవాత రోజే ఆమెకు సుప్రీంకోర్టు నుంచి షాకింగ్ న్యూస్ వచ్చింది. ఈ కేసు నుంచి గతంలో శ్రీలక్ష్మి హైకోర్టు డిశ్చార్జ్ చేసింది. కానీ హైకోర్టు తీర్పును పక్కన పెట్టిన సుప్రీంకోర్టు ఈ కేసులో.. తీర్పుతో సంబంధం లేకుండా

...మిగతాది 2 లో

## పాకిస్తాన్ కు భారత్ రిటర్న్ గిఫ్ట్

### మోడీతో చెప్పమని చెప్పాడుగా.. ఇప్పుడు వాళ్ళకు మోడీ చెప్పాడు!



జయభేరి, హైదరాబాద్ మే 7:

ఆపరేషన్ సింధూర్' మీద యావత్ భారతదేశం హర్షం వ్యక్తం చేస్తోంది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకుల మీద తీవ్రవాదులు దాడి చేసిన సంగతి తెలిసిందే. ప్రజల మతం తెలుసుకుని మరీ ప్రాణాలు తీశారు. భర్తను చంపేసిన ఉగ్రవాదులతో తననూ చంపేయమని ఓ భార్య అడగ్గా... 'మోడీకి వెళ్లి చెప్పు' అని బదులు ఇచ్చింది ఉగ్రమూక. ఇప్పుడు మోడీ గట్టిగా బదులు ఇచ్చారని కథానాయిక, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి భారత్ ధీటుగా బదులు ఇచ్చింది. పాక్ గడ్డ మీద తీవ్రవాద శిబిరాల మీద వైమానిక దాడి చేసింది. ఈ ప్రతీకార ఘటనపై కంగనా రనౌత్ పోస్ట్ చేశారు. ''ఉనోనే కహా థా... మోడీ కో బతా దేనా! ఔర్ మోడీ నే ఉన్ కో బతా దియా'' (వాళ్ళు చెప్పారు కదా... మోడీకి వెళ్లి చెప్పు అని. ఇప్పుడు మోడీ వాళ్ళకి చెప్పారు) అని కంగనా రనౌత్ పోస్ట్ చేశారు. మోడీ చెబితే ఎలా ఉంటుందో అనే గర్వం ఆమె మాటల్లో వ్యక్తం అయ్యింది.

మొదటిపేజీ తరువాయి

## ఆపరేషన్ సిందూర్

విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు మీడియా, సోషల్ మీడియాలో అసవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నెంబర్ ఇవ్వాలని అన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపైన కఠినంగా వ్యవహరించాలని అన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిలువలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అత్యవసర మెడిసిన్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో బెడ్‌ల అందుబాటు పైన ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలని చెప్పారు. రెడ్ క్రాస్ సమన్వయం చేసుకోవాలన్నారు. ఆహార నిల్వలు తగినంత ఉండేలా చూడాలని అన్నారు. సైబర్ సెక్యూరిటీ మీద అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన ఉక్కుపాదం మోపాలని హెచ్చరించారు, ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకి అనుసంధానం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రతను పెంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర భద్రతను పెంచాలని ఆదేశించారు. ఐటీ సంస్థల దగ్గర భద్రతను పెంచాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైతే పీస్ కమిటీలతో మాట్లాడాలని సూచించారు. రౌడీషీటర్లపైన, పాత నేరస్తుల పట్ల పోలీస్ డిపార్ట్ మెంట్ అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## మన దేశానికి ఈ గతి పట్టింది

ఇలాంటి దాడులు సహించలేక మోదీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. భారత సైన్యం చేపట్టే ప్రతి చర్యకు దేశం మొత్తం మద్దతు తెలుపుతుంది. దేశంలో ఏదైనా వ్యతిరేకంగా పోస్టులు పెట్టినా వారిపై ఫిర్యాదు చేయండి. సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లం అంటూ దేశ భద్రతకు, జాతీయ సమగ్రతకు వ్యతిరేకంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు ఉంటాయి. సోషల్ మీడియాలో కుక్కల్లా ఏది పడితే అది మొరగకూడదని హెచ్చరిస్తున్నాం. భారత ఆర్మీకి, ఉగ్రవాదులపై పోరాటానికి చర్యలు తీసుకుంటున్న కేంద్ర ప్రభుత్వంపై పిచ్చి కూతలు కూసినా, ఏది పడితే అది మొరిగినా చర్యలు ఉంటాయని గుర్తుంచుకోవాలి. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా, పాకిస్తాన్ కు మద్దతుగా కొందరు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారు. నేను వారిని మాత్రమే ఉద్దేశించి మాట్లాడాను . అందరు కాంగ్రెస్ నేతల గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. మతం ఆదారంగా ఎలాంటి వివక్ష ఉండకూడదు, దాడులు జరగడం దారుణమన్నారు. సెలబ్రిటీలు దేశాన్ని నడపటం లేదు. కేవలం ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు, నేతలు మాత్రమే పరిపాలన చేస్తున్నారు. సోషల్ మీడియాలో చేసే కామెంట్లతో దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం అనుకోవడం సరికాదు.నాన్ లోకల్ వాళ్లు ఎక్కువ ఉద్యోగాలు సాధిస్తున్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం జరిగింది. వేరే ప్రాంతాల వారు ఇక్కడికి వస్తే వారికి అవకాశాలు లభిస్తే.. స్థానికులు నష్టపోతారు. అదే విధంగా బంగ్లాదేశ్ నుంచి రోహింగ్యాలు మన దేశంలోకి రావడం మరో పెద్ద సమస్యగా మారుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వీటన్నింటికి సరైన రీతిలో పరిష్కారం చూపిస్తుందని పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు.ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ బలగాలు భింబర్, మురిడ్కే, బహావల్‌పూర్, సియాల్‌కోట్ , తెహ్రా కలాన్, కోట్లి, ముజఫరాబాద్‌లలోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేశాయి. జేషే మహ్మద్, లష్కరే తోయిబాతో పాటు హిజ్బుల్ ముజాహిద్దీన్ ట్రైనింగ్ క్యాంపులపై సైతం సైన్యం 25 నిమిషాల పాటు మెరుపు దాడి చేసి నాశనం చేసింది. నేడు మీడియాతో మాట్లాడుతూ కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, విదేశాంగ కార్యదర్శి ఆపరేషన్ సిందూర్ వివరాలు వెల్లడించారు.

## ఐఏఎస్ శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టు గట్టి షాక్

శ్రీలక్ష్మి పాత్రపై విచారణ చేయాలని ఆదేశించింది. మరో నెలల్లో విచారణ చేయాలని సూచించింది. గాలి జనార్ధన్ రెడ్డి ఓబులాపురం మైనింగ్ పేరుతో దోపిడీ చేస్తున్నప్పుడు ప్రభుత్వంలో మైనింగ్ శాఖ ఉన్నతాధికారిగా శ్రీలక్ష్మి ఉన్నారు. లీజుల్లో అవకతవకలు దగ్గర నుంచి గాలి జనార్ధన్ రెడ్డికి అర్హత లేకపోయినా లీజులు కట్టబెట్టడం వరకూ చాలా తప్పులు ఆమె చేతులు మీదుగా జరిగాయని సీబీఐ కేసులు పెట్టింది. గాలి జనార్ధన్ రెడ్డి నుంచి ఆర్థిక ప్రయోజనాలు కూడా పొందినట్లుగా ఆరోపించారు. అయితే ఈ కేసుతో తనకు ఏం సంబంధం లేదని మొదటి సీబీఐ కోర్టు డిశ్చార్జ్ పిటిషన్ వేశారు. కానీ సీబీఐ కోర్టు కొట్టి వేసింది. అదే పిటిషన్ ను హైకోర్టులో వేశారు. 2022లో ఆమెను కేసు నుంచి డిశ్చార్జ్ చేస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. హైకోర్టు తాము చూపించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకోకుండా డిశ్చార్జ్ చేశారని సీబీఐ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. మూడు నెలల్లోగా విచారణ చేయాలని సూచించింది. అంటే.. ఈ కేసులో ఒక్క శ్రీలక్ష్మి విషయంలోనే నేరం చేశారా లేదా అన్నది విచారణ జరిపి ఆమె నేర ప్రమేయంపై సాక్ష్యాలు ఉంటే దోషిగా తేల్చి శిక్ష ఖరారు చేస్తారు. ఓబుళాపురం మైనింగ్ కేసులో గాలి జనార్ధన్ రెడ్డికి సీబీఐ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. సుదీర్ఘంగా సాగిన విచారణ తర్వాత తీర్పు వచ్చింది. గాలి జనార్ధన్ రెడ్డితో పాటు శ్రీనివాస్ రెడ్డి, రాజగోపాల్, అలీఖాన్‌లతో పాటు ఓఎంసీ కంపెనీని దోషులుగా తేల్చారు. ఇందులో ఏ వన్ గా శ్రీనివాసరెడ్డి ఉన్నారు. ఆయనకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. మిగిలిన నిందితులకూ అదే జైలుశిక్ష విధించారు. ఓఎంసీ కంపెనీకి లక్ష జరిమానా విధించారు. కర్ణాటక, అనంతపురం సరిహద్దుల్లో ఐరన్ ఓర్ ను ఇష్టం వచ్చినట్లుగా తవ్వేసి ఎగుమతి చేసుకున్నారన్నా ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర సరిహద్దులు కూడా చెరిపేశారని సీబీఐ కేసులు నమోదు చేసింది. 2009లో సీబీఐ ఈ వ్యవహారంలో ఎంట్రీ ఇచ్చింది. అప్పటి సీబీఐ జేడీ లక్ష్మినారాయణ గాలి జనార్ధన్ రెడ్డిని బళ్లారి నుంచి అరెస్టు చేసి తీసుకు వచ్చారు. మూడేళ్లకుపైగా జైల్లో ఉన్న తర్వాత ఆయనకు బెయిల్ వచ్చింది.

## ఆపరేషన్ సింధూర్.. రాష్ట్రపతికి వివరించిన ప్రధాని

ముర్ముకు ప్రధాని మోదీ కలిశారు. ఆపరేషన్ సింధూర్‌పై రాష్ట్రపతికి ప్రధాని మోదీ వివరించారు. అంతేకాకుండా.. ప్రస్తుత పరిస్థితులు.. మాక్ డ్రిల్ తదితర అంశాల గురించి చర్చించారు.పాకిస్తాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన తర్వాత.. రాష్ట్రపతి ముర్ముతో భేటీకి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం మధ్యాహ్నం మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. క్యాబినెట్ వర్గాల సమాచారం ప్రకారం, సమావేశంలో మోదీ తన క్యాబినెట్ సహచరులకు పాకిస్తాన్‌పై ప్రారంభించిన ఆపరేషన్ గురించి వివరించారు.భారత సైన్యం ఎటువంటి పొరపాటు లేకుండా, సన్నద్ధత ప్రకారం చర్య చేపట్టిందని కూడా ప్రధాని అన్నారు. ఇది గర్వకారణమైన క్షణం.. అంటూ ప్రధానమంత్రి సైన్యాన్ని ప్రశంసించారు. దీని తరువాత, కేంద్ర మంత్రివర్గంలోని మంత్రులందరూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.. దేశం మొత్తం ఆయనతో ఉందని అన్నారు. ఆపరేషన్ సింధూర్ గురించి రాజ్‌నాథ్ సింగ్ కేబినెట్ సమావేశంలో పలు విషయాలను వెల్లడించారు. మంత్రివర్గ సభ్యులందరూ టేబుల్ చప్పట్లు కొట్టి ఆయనను అభినందించారు.

**ఆపరేషన్ సింధూర్ పై అఖిలపక్ష సమావేశం..**

ఆపరేషన్ సింధూర్ వివరాలు వెల్లడించేందుకు ప్రభుత్వం గురువారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ఈ సమావేశం జరగనుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కూడా ఈ భేటీలో పాల్గొననున్నారు.

# పాకిస్తాన్ కు భారత్ రిటర్న్ గిఫ్ట్

పహల్గాం దాడి తర్వాత భారత్ ప్రతీకార చర్యకు పూనుకుంటుంది. ఈ దాడిలో అమాయకమైన భారత పౌరులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను అంతం చేసేలా చర్యలు తీసుకుంటామని ఇప్పటికే భారత్ గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. అయితే ఎప్పుడెప్పుడు అని ఎదురుచూస్తున్న భారత్కు ఈ అర్ధరాత్రి యుద్ధం ప్రారంభించింది.




'ఆపరేషన్ సింధూర్' పేరుతో ప్రారంభించిన ఈ యుద్ధం లో భాగంగా ఉగ్రవాద శిబిరాలపై బాంబుల వర్షం కురిపించింది. దీంతో చాలామంది ఉగ్రవాదులు హతమైనట్లు తెలుస్తోంది. అయితే కవ్వింపు చర్యల్లో భాగంగా పాకిస్తాన్ సరిహద్దుల్లో కాల్పులకు తెగబడింది దాదాపు 12 రోజుల పాటు సంయమనం పాటించిన భారత్... ఆపరేషన్ సింధూర్ పేరిట పాక్ వెన్నులో వణుకు పుట్టించిందొ. అర్ధరాత్రి 1.44 గంటలకు పాక్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై మెరుపు దాడులు చేసింది భారత్ ఆర్మీ. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆర్మీ చేపట్టిన ఈ వైమానిక దాడులతో దాయాది దేశం ఉక్కిరిబిక్కిరవుతోంది. అయితే ఈ స్ట్రైక్స్ కేవలం టీజర్ మాత్రమేనని.. ఇది 'ఆపరేషన్ సింధూర్' మొదటి దశ మాత్రమేనా.! త్వరలో మరిన్ని దాడులు ఉండొచ్చంటూ సైన్యం నుంచి సంకేతాలు అందుతున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇక పాక్ టెర్రరిస్ట్ లాంచ్ ప్యాడ్‌ల ధ్వంసంతో దేశమంతా సంబరాలు జరుపుకుంటున్నారు ప్రజలు.అటు పాకిస్తాన్, పీఓకేలోని టెర్రరిస్టుల స్థావరాలే లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'పై మిత్ర దేశాలకు భారత్ సమాచారం అందించింది. దాడుల అనంతరం అమెరికా, యూకే, రష్యా, సౌదీ అరేబియా, యూఏఈ సహా.. పలు దేశాల ప్రతినిధులకు, సీనియర్ అధికారులతో మాట్లాడారు ఉన్నతాధికారులు. టెర్రర్ క్యాంప్‌లపై దాడికి కారణాల్ని వివరించారు. టెర్రరిజాన్ని అంతమొందించాలనే ఈ స్ట్రైక్స్ చేసినట్టు వివరించారు. ప్రక్ ప్రజలకు ఎలాంటి హాని జరగలేదని చెప్పారు.జమ్ము కాశ్మీర్లోని పహాల్గంలో ఏప్రిల్ 22వ తేదీన ఉగ్రవాదులు ఆకస్మికంగా ఈ ప్రాంతానికి వచ్చి భారత పౌరులను నిర్దాక్షిణ్యంగా కాల్చివేశారు. అయితే ఇందులో మహిళలు విడిచిపెట్టి వారి భర్తలను కళ్లెదుటే కాల్చివేయడం కాల్చివేసింది. అంతేకాకుండా హిందువులు ఎవరు అని అడిగి మరీ చెప్పడం భారత్ ను దెబ్బ కొట్టడమే లక్ష్యమని అంటున్నారు. ఈ దాడి కేవలం కొందరిపై మాత్రమే కాదని యావత్ దేశంపై అని ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు. దీనికి ప్రతీకారంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఇందులో భాగంగా అవసరమైతే యుద్ధం కూడా చేయాల్సి వస్తుందని ఇదివరకే చెప్పారు. అయితే తాజాగా ప్రారంభించిన యుద్ధానికి 'ఆపరేషన్ సింధూర్' అని పేరు పెట్టారు. సింధూర్ అంటే కేవలం నామమాత్రమైన పేరు మాత్రమే కాదని, మహిళలు భర్తలకు ప్రతిరూపంగా నుదుటన కుంకుమను ధరిస్తారు. కానీ పహల్గాం లో మహిళలను విడిచిపెట్టి వారి భర్తలను చంపి వారి నుదుటన ఉన్న కుంకుమను చెరిపివేశారు. ఈ కుంకుమ మరోసారి చెరిగిపోకుండా ఉగ్రవాదులను అంతం చేయడమే లక్ష్యమని... అందుకే ఈ ఆపరేషన్కు.. 'ఆపరేషన్ సింధూర్' అని పేరు పెట్టినట్లు చెబుతున్నారు. ఉగ్రవాదులను అంతం చేసి మహిళల గౌరవాన్ని నిలబెడతామని ఈ సందర్భంగా ఈ ఆపరేషన్కు ఈ పేరు పెట్టినట్లు చెబుతున్నారు.యితే భారత్, పాకిస్తాన్ మధ్య ప్రధానంగా ఉన్న నది సింధూ నది. ఈ నది నీళ్లను ఆపివేయడంతో అసలైన యుద్ధం మొదలైందని.. అందుకే దీనికి ఆపరేషన్ సింధూర్ అని పేరు పెట్టినట్లు మరి కొందరు అంటున్నారు. కానీ ముఖ్యంగా మహిళల కోసమే ఈ పేరును నిర్ణయించినట్లు మరి కొందరు అంటున్నారు. ఏది ఏమైనా 'ఆపరేషన్ సింధూర్'పేరుతో ప్రారంభమైన ఈ యుద్ధంలో భారత్ పై చేయి సాధిస్తుందని నమ్మ పలుకుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఉగ్రవాదులపై మిస్సైల్స్ దాడి చేసిన వీడియోలు బయటకు వచ్చాయి. ఉగ్రవాదుల జాడ తెలుసుకున్న ఆర్మీ ఆ శిబిరాలను కుప్పకూల్చేందుకు తీవ్రంగా కసరత్తు చేస్తున్నాయి. అయితే ఈ సమయంలో పాక్ చేస్తున్న కాల్పులను కూడా తిట్టు కొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తంగా 'ఆపరేషన్ సింధూర్' విజయవంతం కావాలని యావత్ భారతదేశం కోరుకుంటుంది.ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారతదేశం పాకిస్తాన్‌లోని అనేక ప్రదేశాలపై దాడి చేసింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, ప్రజలకు ఇది జరగబోతుందని ముందే తెలుసునని అన్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, "ఓవల్ కార్యాలయంలోకి వెళ్తున్నప్పుడే మాకు ఈ విషయం తెలిసింది. గతంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా ప్రజలకు ఏదో జరగబోతుందని తెలుసునని నేను అనుకుంటున్నాను. వారు చాలా కాలంగా పోరాడుతున్నారు. మీరు దీని గురించి ఆలోచిస్తే, వారు అనేక దశాబ్దాలు, శతాబ్దాలుగా పోరాడుతున్నారు. ఇది చాలా త్వరలోనే ముగుస్తుందని నేను ఆశిస్తున్నాను."'మాకు ఎటువంటి అంచనా లేదు' ఇంతలో, భారత సైన్యం యొక్క 'ఆపరేషన్ సిందూర్' గురించి US స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి మాట్లాడుతూ, "దీని గురించి మాకు తెలుసు. అయితే, ప్రస్తుతానికి మాకు ఎటువంటి అంచనా లేదు. మారుతున్న పరిస్థితి పర్యవేక్షిస్తున్నాము." అని అన్నారు.భారత సైన్యం చర్యపై రక్షణ మంత్రిత్వ శాఖ మాట్లాడుతూ, "ఒక నేపాలీతో సహా 26 మంది మరణానికి ప్రతీకారంగా, భారతదేశం ఆపరేషన్ సిందూర్ ప్రారంభించింది, ఇది అనాగరికమైన పహల్గామ్ ఉగ్రవాద దాడికి కచ్చితమైన సంయమనంతో కూడిన ప్రతిస్పందన. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై లక్ష్యంగా దాడులు జరిగాయి, సరిహద్దు ఉగ్రవాద ప్రణాళిక మూలాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ముఖ్యంగా, పాకిస్తాన్ సైనిక స్థావరం ఏదీ దెబ్బతినలేదు, ఇది భారతదేశం సంయమనంతో చేసిన దాడి.

**ఉగ్రవాదులను అంతం చేసి మహిళల గౌరవాన్ని నిలబెడతామని ఈ సందర్భంగా ఈ ఆపరేషన్కు ఈ పేరు పెట్టినట్లు చెబుతున్నారు.యితే భారత్, పాకిస్తాన్ మధ్య ప్రధానంగా ఉన్న నది సింధూ నది. ఈ నది నీళ్లను ఆపివేయడంతో అసలైన యుద్ధం మొదలైందని.. అందుకే దీనికి ఆపరేషన్ సింధూర్ అని పేరు పెట్టినట్లు మరి కొందరు అంటున్నారు. కానీ ముఖ్యంగా మహిళల కోసమే ఈ పేరును నిర్ణయించినట్లు మరి కొందరు అంటున్నారు. ఏది ఏమైనా 'ఆపరేషన్ సింధూర్'పేరుతో ప్రారంభమైన ఈ యుద్ధంలో భారత్ పై చేయి సాధిస్తుందని నమ్మ పలుకుతున్నారు.**

## ఎప్పుడు? ఎక్కడ? ఎలా?

**కల్నల్ సోఫియా ఖురేషి ప్రెస్ మీట్‌లో ఏం చెప్పారు?**

కల్నల్ సోఫియా ఖురేషి మాట్లాడుతూ, POJKలో మొదటి లక్ష్యం ముజఫరాబాద్‌లోని సవాయి నాలా క్యాంప్ అని చెప్పారు.

ఇది నియంత్రణ రేఖ నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది లష్కరే తోయిబా శిక్షణా కేంద్రం. 2024 అక్టోబర్ 20న సోనామార్గ్, 24 అక్టోబర్ 2024న గుల్మార్గ్, 22 ఏప్రిల్ 2025న పహల్గామ్‌లో జరిగిన దాడుల్లో పాల్గొన్న ఉగ్రవాదులు ఇక్కడే శిక్షణ పొందారు. ఈ దాడి తెల్లవారుజామున 1:05 నుంచి 1:30 గంటల మధ్య జరిగిందని వైమానిక దళ వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ తెలిపారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి బాధితులకు, వారి కుటుంబాలకు న్యాయం చేయడానికి భారత సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్ ప్రారంభించాయి. తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని విజయవంతం అయ్యాం. పౌరులకు ఎలాంటి నష్టం జరగకుండా, ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా టార్గెట్‌స్‌ను ఫిక్స్ చేశాం. పహల్గామ్ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు రెసిస్టెన్స్ ఫ్రంట్ అనే సంస్థ ప్రకటించుకుందని అన్నారు. ఈ సంస్థ లష్కరే తోయిబాతో సంబంధం కలిగి ఉంది. ఈ దాడిలో పాకిస్తాన్ ప్రమేయం ఉందని తేలింది.

పహల్గామ్‌పై జరిగిన దాడి పిరికిపంద చర్య అని, పహల్గామ్ దాడి దర్యాప్తులో పాకిస్తాన్ ఉగ్రవాదులతో సంబంధాలను స్పష్టమయ్యాయని అన్నారు.ఉగ్రవాద కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న మా నిఘా సంస్థలు భారతదేశంపై మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని సూచించాయని, వాటిని నిరోధించడం, ఎదుర్కోవడం అవసరమని భావించామని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అన్నారు.ఈ ఉదయం, సీమాంతర ఉగ్రవాదాన్ని నిరోధించేలా భారత్ స్పందించిందని అన్నారు. ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలు నాశనం చేయడంపై దృష్టి పెట్టాం. ఈ ప్రెస్ మీటింగ్ ప్రారంభంలో, 2001 పార్లమెంటు దాడి, 2008 ముంబై ఉగ్రవాద దాడి, ఉరి, పుల్వామా, పహల్గామ్ దాడులతో సహా భారతదేశంపై జరిగిన అనేక దాడులకు సంబంధించిన క్లిప్‌ను కూడా చూపించారు

## అందాల పోటీలకు భాగ్యనగరం ముస్తాబు




**జయభేరి, హైదరాబాద్, మే 7:** మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ రెడీ అయింది. ప్రపంచ సుందరీమణులు ఒక్కొక్కరుగా హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రస్తుతం సందడిగా మారింది, వివిధ దేశాల నుంచి అందాల పోటీదారులు ఇక్కడ దిగుతున్నారు. విదేశీ ప్రతినిధులకు తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. విమానాశ్రయంలో ప్రత్యేక లాంజ్‌లు, సమాచారం అందించేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, సంస్కృతి, ప్రత్యేక చిహ్నాలతో కూడిన స్వాగత తోరణాలు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి.. అటు.. మిస్ వరల్డ్ పోటీలపై అధికార, విపక్షాల మధ్య మాటలయుద్ధం కాక రేపుతోంది. ఈ క్రమంలో.. మంత్రి జూపల్లి కృష్ణారావు విపక్షాల విమర్శలపై స్పందించారు. తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించేందుకే మిస్ వరల్డ్ పోటీలు.. అంటూ.. అందాల పోటీలపై విపక్షాల కామెంట్‌స్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు కౌంటర్ ఇచ్చారు.పెట్టుబడుల సంగతి ఎలా ఉన్నా.. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సందడి మాత్రం షురూ అయింది. మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఇప్పటికే సుమారు 90 మంది పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నారు. వారిలో మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్ పెడ్రోసో, మిస్ సౌత్ ఆఫ్రికా జోయాలిజే జాన్సన్‌వాన్ రెన్‌స్‌బర్గ్ వంటి వారు ఉన్నారు. పర్యాటక శాఖ అధికారులు వీరికి విమానాశ్రయంలో సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, అనంతరం వారిని బస ఏర్పాటు చేసిన హోటళ్లకు తరలించారు.ఈ మిస్ వరల్డ్ పోటీల్లో పాకిస్తాన్ కూడా ప్రాతినిధ్యం వహిస్తోంది.

మిస్ పాకిస్తాన్ కూడా ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నట్లు సమాచారం. ప్రపంచ సుందరీమణులతో హైదరాబాద్ కళకళలాడుతోంది, అంతర్జాతీయ స్థాయిలో నగరం ప్రతిష్టను పెంచే ఈవెంట్‌కు అంతా సిద్ధమైంది.ఈ నెల 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానుండగా.. 31న హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలేతో ముగియనున్నాయి. అదే రోజు విజేతను ప్రకటిస్తారు. జూన్ 2న జరిగే తెలంగాణ అవతరణ దినోత్సవం వేడుకల్లో మిస్ వరల్డ్‌గా నిలిచిన సుందరీమణి పాల్గొంటారు. ఈ పోటీలకు 116 దేశాలకు చెందిన పోటీదారులు హాజరుకానున్నారు. దాంతో.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి హైదరాబాద్ హైటెక్స్ వరకూ బ్యానర్లు, కటౌట్లు కళకళలాడిపోతున్నాయి.మిస్ వరల్డ్ పోటీలో పాల్గొనేందుకు ప్రపంచ సుందరీమణులు ఒక్కొక్కరుగా హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే.. మిస్ ఇండియా నందిని గుప్తా, మిస్ మెక్సికో సెర్వాన్‌టెస్, మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్, మిస్ సౌత్ ఆఫ్రికా జోయాలిజే సహా దాదాపు 90 మందికిపైగా పోటీదారులు హైదరాబాద్‌లో అడుగు పెట్టారు. వారికి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో పర్యాటక శాఖ అధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, ఆ తర్వాత అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్‌స్‌కు తరలించారు. మిస్ వరల్డ్ పోటీలకు హాజరయ్యే టీమ్‌లు బస చేసేందుకు హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్‌స్‌లో ఏర్పాట్లు చేశారు. మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించి ఏర్పాట్లను టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా.. మంత్రి జూపల్లిని మిస్ ఇండియా, మిస్ మెక్సికో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదిలావుంటే.. మిస్ వరల్డ్ పోటీలపై రాజకీయంగా దుమారం రేగుతోంది. అకాల వర్షాలతో అన్నదాత ఆగమవుతుంటే వారి గోడు పట్టదా అంటూ రేవంత్ ప్రభుత్వంపై విపక్షాలు మండిపడుతున్నాయి. అటు.. కశ్మీర్‌లో కల్లోలం చెలరేగితే అందాల పోటీలు నిర్వహిస్తారా అని హిందూ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. అలాగే.. అందాల పోటీలను వ్యతిరేకిస్తూ మహిళా సంఘాలు ర్యాలీలు తీస్తున్నాయి.

# మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- 15లక్షల రూపాయల వ్యయంతో మైత్రి ఫార్మర్ ప్రొడ్యూసర్ కం పెనీ ప్రారంభం
- దేవరకొండ నియోజకవర్గంలో ప్రతి ఎకరానికి సాగు నీరు అందించే బాధ్యత బాలు నాయక్ దే
- దేవరకొండ నియోజక వర్గంలో ఉన్న ప్రతీ పేదవాడికి ఇల్లు కట్టించే బాధ్యత నాది
- ఐదు సంవత్సరాలలో దేవరకొండ నియోజగవర్గాన్ని 119 నియోజగవర్గాలలో నెంబర్ 1 చేసే బాధ్యత నాది.
- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మండలంలోని మర్రి చెట్టుతండా వద్ద 15లక్షల రూపాయల వ్యయంతో మైత్రి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ వారు, ట్రైకర్ నిధులతో నిర్మించిన గోదాంను నాబార్డ్ సూర్యాపేట DDM రవీందర్ నాయక్, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్. మైత్రి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ వారి ఆధ్వర్యంలో నిర్మించిన గోదాం ను రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికి నాణ్యమైన ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం. రాజీవ్ యువ వికాసం పథకంతో నిరుద్యోగుల జీవితాలు మారుతాయి, వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయి రాష్ట్రంలో ఈ పథకం ఒక గేమ్ చేంజర్ గా మిగులుతుంది. నిరుపేద, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, సామాజిక న్యాయ సాధికారత లక్ష్యంగా ప్రజా పాలన సాగిస్తున్నాం. శాసన సభ ఎన్నికల్లో అత్యధికంగా మెజారిటీ ఇచ్చిన ముదిగొండ, తెల్దేవారి పల్లి,ఉమ్మడి మైనంపల్లి గ్రామాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నా శాయశక్తుల కృషి చేస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా,నాబార్డ్ DDM సూర్యాపేట రవీందర్ నాయక్,PACS చైర్మన్లు డాక్టర్ వేణుధర్ రెడ్డి,కొంఢ్ర శ్రీశైలం యాదవ్, ఎంపిడిఓ డానియల్, స్పెషల్ ఆఫీసర్ శంకర్, మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమి రాంసింగ్ నాయక్,యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్,యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మాజీ ఎంపీటీసీ సీత్యా నాయక్,మాజీ కోఆప్షన్ సభ్యులు,మాజీ ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, పాండు నాయక్,ఆంజనేయులు,శంసిర్ ఆలీ, లక్ష్మణ్ నాయక్,అంజయ్య,వెంకటయ్య, నాబార్డ్ డైరెక్టర్లు,NSUI నాయకులు,గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

జయభేరి, కరీంనగర్:

సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా పైలట్ మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులలో భాగంగా బుధవారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఎక్లాస్ పూర్, రాయికల్ గ్రామాలలో గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన సదస్సులకు కలెక్టర్ హాజరయ్యారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే అన్ని మండలాల్లో నూతన చట్టం గురించి అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సైదాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాతిపదికన ఎంపిక చేసి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు,

**విస్తీర్ణం హెచ్చు తగ్గులు,**

వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్‌బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. భూభారతి కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించే అవకాశం లభించని వారు తరువాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. భూ భారతి పోర్టల్ ద్వారా ఆన్లైన్లో కూడా అప్లై చేసుకోవచ్చని అన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ కోరారు. భూ సమస్యలను పరిష్కరించుకుని, భూ వివాదాలు లేని గ్రామాలుగా పల్లెలను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సులను సైదాపూర్ మండలంలోని అన్ని గ్రామాల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పైలెట్ మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు పూర్తయ్యాక, జిల్లాలోని మిగతా అన్ని మండలాలలో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామని అన్నారు.

ఈ సందర్భంగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మా లో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ, సత్వర పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తహసీల్దార్ దృష్టికి తెచ్చి పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. ఈ సదస్సులలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీఓ మహేశ్వర్, తహసిల్దారులు కనకయ్య, శ్రీనివాస్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు

- కులమతాలు రాజకీయాలకు అతీతంగా దేశం వైపు నిలబడదాం
- దేశ ప్రజలు అంతా ఏకం కావాలసిన సమయం వచ్చింది
- మన దేశం వైపు చూడాలంటేనే శరీరంలో వణుకు పుట్టాలి



జయభేరి, వర్గల్, మే 07 :

జమ్ము కాశ్మీర్ లోని పహల్గాం ప్రదేశానికి వెళ్లిన టూరిస్టులను అతి దారుణంగా కాల్చి చంపిన ఉగ్రవాదులను భారత సైనికులు మట్టుబెట్టిన తీరు సరైనదని మండల బిజెపి నాయకులు తెలిపారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ కు బుద్ధి వచ్చేలా తీవ్రవాద సంస్థలను ఉగ్రవాదులను ఏరి పారేయాలి ప్రధానమంత్రి మోడీ కృషి ఎంతో ఉందన్నారు. ఉగ్రవాదులు తీవ్రవాదులు మన దేశం వైపు చూడాలి అంటేనే శరీరంలో వణుకు పుట్టేలా చేశారని తెలిపారు. భారత్ సైనికులకు దేవుడు అండగా నిలవాలని దేశ ప్రజలంతా పూజలు ప్రార్థనలు చేయాలి అని అన్నారు.

రాగ ద్వేషాలు పక్కనపెట్టి కులాలు మతాలు రాజకీయాలకు అతీతంగా ఇలాంటి సమయంలో దేశం వైపు మనమంతా నిలబడాలి అని అన్నారు. ఉగ్రవాదులను చంపే వరకు ఆపరేషన్ సింధూర్ కొనసాగించాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో బొప్పిడి సుధాకర్ రెడ్డి,దిండి నాగరాజు గౌడ్, మఠం మహిపాల్ యాదవ్, రంగు ప్రదీప్ గౌడ్, కిచ్చిగారి పాండు, నూక బద్రి, ఎర్రబన్నీ రెడ్డి, ఎర్రవల్లి వెంకటేష్ గౌడ్, ముదుసు నరేందర్ రెడ్డి, ముదుసు యశ్వంత్ రెడ్డి, మంకీ యాదగిరి, బబ్బురి వెంకటేష్ గౌడ్, మణికాంత్ పటేల్ ,సాయి ప్రకాష్ , కటిక రాము, డ్యాగల సునీల్, ఎర్రవల్లి మధు గౌడ్ ,ప్రవీణ్ గౌడ్ ,వడ్డరి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రనాథ్ ఠాగూర్ 164 వ జయంతి వేడుకలు

- దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ 164 వ జయంతి వేడుకలు




జయభేరి, దేవరకొండ :

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు రవీంద్రనాథ్ ఠాగూర్ 164వ జయంతి సందర్భంగా అధ్యక్షుడు NVT, ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, సభ్యులతో కలిసిఆయన పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించినారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేసిన మహనీయులని మరవరాదని, వారి జయంతి వర్ధంతి వేడుకలని తప్పనిసరిగా జరపాలని, ఇలాంటి కార్యక్రమాలకు యువత ముందుండాలని అన్నారు. మనం ధైర్యంగా ఒక అడుగు ముందుకేస్తే విజయం అది అడుగులు ముందుకు వస్తుందని, మనం దేవుణ్ణి ప్రార్థిస్తే ఇష్టపడతాడు కానీ మనం కష్టపడి పని చేస్తే గౌరవిస్తాడని, భారతదేశానికి మొట్టమొదటి నోబుల్ బహుమతి అందించిన వ్యక్తి, విశ్వ కవి, గురుదేవుడు అని ప్రఖ్యాతి గాయించిన వ్యక్తి అని, జనగణమన అధినాయక జయహే అనే జాతీయ గీతాన్ని రచించి మనకు అందించిన గొప్ప వ్యక్తి అని, అలాంటి గొప్ప వ్యక్తులను మనం ఎప్పుడూ మరవరాదని సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కృష్ణ కిషోర్, కేపంతులాల్ నాయక్ ,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండి యూనస్, మాజీ కౌన్సిలర్ పొన్నబోయిన సైదులు, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి భాస్కర్, సందీప్, డాన్స్ మాస్టర్స్ రాక్ స్టార్ రమేష్, డాన్స్ మాస్టర్ ఏడుకొండలు, కరాటే మాస్టర్ చైతన్య, బుజ్జి, జమీర్, శివ, ఆంజనేయులు, శ్రీను, విష్ణు, రాము, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్..

### 23 మంది మావోయిస్టుల హతం..!

జయభేరి, కొత్తగూడెం మే 7:

తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య భీకర కాల్పులు జరిగాయి.

వివరాలు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా కర్రెగుట్టల్లో గత రెండు వారాల పైగా వేల సంఖ్యలో భద్రతా దళాలు మావోయిస్టుల వేటలో నిమగ్నమైన విషయం విదితమే. ఈ క్రమంలోనే ఇప్పటివరకు సుమారు పదిమంది మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.కాగా తాజాగా బుధవారం ఉదయం బీజాపూర్ జిల్లాలోని కర్రెగుట్ట ప్రాంతాల్లో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న భద్రతా దళాలకు మావోయిస్టులు తారాసపడ్డారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఇప్పటివరకు 23 మంది మావోయిస్టులు నేలకొరిగినట్లు సమాచారం. కాగా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలం నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అంతిమ లక్ష్యంగా జరుగుతున్న ఆపరేషన్ “కగార్” స్వల్ప విరామం తర్వాత తీవ్ర రూపం దాల్చింది. ప్రస్తుతం జరుగుతున్న ఎదురు కాల్పుల్లో మావోయిస్టులు భారీ సంఖ్యలోనే మృతి చెందారు అన్న వార్తలు వినవస్తున్నాయి. అయితే డ్రోన్ కెమెరాల సహాయంతో మావోయిస్టుల కదలికలను పసిగట్టి కాల్పులకు పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం.



## శామీర్ పేటలో పోలీసుల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్

- అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలని సలహాలు, సూచనలు అందించిన : సీఐ శ్రీనాథ్

జయభేరి, మే 7:

భారత్ పాక్ ల మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ప్రజల్లో అప్రమత్తత పెంపొందించే ఉద్దేశ్యంతో పోలీసుల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇందులో భాగంగా శామీర్ పేటలో పోలీసులు సాయంత్రం 4 గంటల నుంచి 4:30 నిమిషాల వరకు సైరన్ నిర్వహించి ముఖ్యమైన ప్రాంతాల్లో హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం ప్రజలకు పలు సలహాలు , సూచనలు అందచేశారు. సురక్షిత స్థలాలను ఎలా గుర్తించాలి, ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి మరియు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలి అనే దానిని ఈ మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రజల భద్రతే తమకు ముఖ్యమని , ప్రజలు కూడా పోలీసులకు అన్ని విధాలుగా సహకారం అందించాలని వారు కోరారు.

## ఎస్ ఎన్ ఎఫ్ ఆధ్వర్యంలో తిక్కవానిపాలెంలో సీసీ రోడ్డు పనులు



జయభేరి, పరవాడ:

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం తిక్కవానిపాలెం పంచాయతీలో ఫార్మాసిటీ కంపెనీ ఎస్ ఎన్ ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలులో భాగంగా సీసీరోడ్లులను బుధవారం ఫార్మాసిటీ ఎస్ ఎన్ ఎఫ్ వారు పనులు పరివేక్షించారు. ఈ కార్యక్రమాన్నికి ముఖ్య అతిథిగా ఎస్ ఎన్ ఎఫ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ కుమారేషన్ రాజేంద్రన్ మాట్లాడుతూ.. సీఎస్ ఆర్ ఫార్మసిటి పరిసర ప్రాంతాల మౌలిక సదుపాయాలు కొరకు ఎస్ ఎన్ ఎఫ్ ఫార్మా కంపెనీ కృషి చేస్తుంది అని అన్నారు, గ్రామ సర్పంచ్ చేపల మసేను మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్డులను చేపడుతున్నందుకు, ఫార్మాసిటీ ఎస్ ఎన్ ఎఫ్ కంపెనీ వారికి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఫార్మా కంపెనీ అధికారులను సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో, ఫార్మాసిటీ కంపెనీ ఎస్ ఎన్ ఎఫ్ అధికారులు, హెచ్ఆర్ డిపార్ట్మెంట్ అనిత సాహూ, ఈ హెచ్ ఎస్ అప్పలనాయుడు* మరియు గ్రామ సర్పంచ్ చేపల మసేను, తిక్కాడ అమ్మోరు, సూరాడ ఎర్రయ్య, మెరిగి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం




జయభేరి, దేవరకొండ :

ఉచిత కంప్యూటర్ శిక్షణను ఉపయోగించుకొని యువత నైపుణ్యాన్ని పెంచుకోవాలని పి ఎ సి ఎస్ చైర్మన్ జాలే నరసింహ రెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలో విలేజ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ఎస్ ఎస్ వి వై వారి ఆర్థిక సహకారంతో కంప్యూటర్, టైలరింగ్ కోర్సులను వారు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి మాజీ ఎంపీపీ నున్సావాత్ పార్వతి చందు నాయక్, వి డి ఎస్ నాగేంద్ర, లావుడి భాష పాల్గొన్నారు.నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా దేవరకొండ పట్టణ, పరిసర ప్రాంత యువతకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని నడుపుతున్నమని బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు గ్రహీత లావుడి భాష పేర్కొన్నారు. కంప్యూటర్, కుట్టు మిషన్ శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, నిహారిక, నేనావత్ రవి, నున్సవత్ శాంతి, జయలక్ష్మి, పున్న వెంకటేష్‌నేత శిక్షణ పొందుతున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అభినందించిన మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్

- మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మండలం బొల్లిగుట్ట తండాకు చెందిన మనోజ్ పదో తరగతి పరీక్షల్లో 541 మార్కులు పొందిన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో మనోజ్ ని ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... గిరిజన తండాకు చెందిన మనోజ్ అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఉన్నత చదువులో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



## టీడీపీ మండల అధ్యక్షుడి ఎన్నిక

జయభేరి, వర్గల్, మే 07 :

వర్గల్ మండల టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం గౌరారం వద్ద జరిగింది. దీనికి ముఖ్య అతిధి గా గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి సబ్బని సత్యం హాజరైనారు. ఈ సమావేశం లో వర్గల్ మండలం టీడీపీ నూతన అధ్యక్షులు గా సింగాయి పల్లి గ్రామానికి చెందిన నల్ల రవీందర్ రెడ్డి, కమిటీ సభ్యులు గా మరి కొందరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## నవవధువు వివాహానికి పుస్తే మట్టెలు



జయభేరి, గజ్వేల్, మే 07 :

సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో బుదవారం లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గోలి సంతోష్ ఆధ్వర్యంలో రాయపోల్ మండలం రామారం గ్రామానికి చెందిన నల్ల లక్ష్మీ నర్సింలు దంపతుల కుమార్తె హారిక (శిరీష) వివాహానికి పుస్తే మట్టెలు అందజేశారు ఈ సందర్భంగా గోలి సంతోష్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా నిరుపేద కుటుంబాలకు నా వంతు సహాయం చేయడం జరిగిందని అందులో భాగంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా రామారం గ్రామానికి చెందిన నవ వధువు వివాహానికి పూస్తే మట్టెలు అందజేయడం జరిగిందని అన్నారు.

## పెన్షనర్స్ భవన నిర్మాణ నిధికి 10,116లు అందజేత



జయభేరి, దేవరకొండ :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ భవన నిర్మాణ నిధికి శ్రీమతి తిపర్తి రాధా రాంరెడ్డి రిటైర్డ్ భవన నిర్మాణ నిధికి రూ 10,116 అందజేసినారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి, కోశాధికారి పంగునూరు లింగయ్య మాట్లాడుతూ పెన్షనర్స్ సేవలకొరకు దాతల సహకారంతో భవన నిర్మాణం చేపట్టి పూర్తిచేయుటలో దాతల సహకారం వెలకట్టలేనిది అన్నారు. దాత మాట్లాడుతూ సేవాసదనం నిర్వహణ, సేవలు వెలకట్టలేని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్, కార్యవర్గ సభ్యులు, సభ్యులు, దాత కుటుంబ సభ్యులు పాలుగోని దాత దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసినారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే రెండు గేదెలు మృతి



జయభేరి, గుడిపల్లి :

గుడిపల్లి మండలం భీమనపల్లి గ్రామాలో భారీ ఈదురుగాలితో వర్షం రావడంతో విద్యుత్ తీగలు తెగి పొలాల్లో పడిపోయాయి. రోజువారిగానే బర్రె కాపరిలు దాదాపు వందల బర్రెలను వివిధ రకాల జంతువులను మేత నిమిత్తమ్ము తీసుకుపోతారు. ప్రమాదవశత్తు రెండు గేదలు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితులు కంభంపాటి శ్రీనయ్య, తల్లి సరస్వతమ్మ చెప్పిన వివరాల ప్రకారం వర్షం వచ్చి దాదాపు 10 గంటలవుతున్న తెగిన తీగలను పట్టించుకో పోవడం గ్రామ కరెంటు అధికారి పై అధికారులు ప్రాణాలు పోయేదాకా ఎలాంటి పట్టింపు లేకుండా వ్యవహరించడం ఇప్పటికీ చాలా సార్లు చెప్పిన అధికారులు పట్టించుకోలేదని వారు గోడు వెళ్ళబోసుకుంటున్నారు. రెండు గేదెల ప్రాణాలు ఇలా వ్యవహరిస్తే మనుషులు ప్రాణాలు కూడా పోతాయని చిటికలో నా ప్రాణం కూడా పోయేదని వాళ్లు ఆవేదన వ్యక్తం చేశారు. నా జీవనదారం పూర్తిగా వాటిపైనే ఆధారపడి బ్రతుకుతున్నానని కుటుంబ సభ్యులు ఇప్పటికైనా అధికారులు స్పందించి వాళ్లకు తగిన నష్టపారిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే కరెంటు ఆఫీసుల ముందు ఆందోళన దిగుతామని వాళ్ళు అన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసన



జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండలం కేంద్రం ఎంపీడీవో ఆఫీస్ ముందు బిఆర్ఎస్ శ్రేణులు ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా చింతపల్లి బీఆరెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపిడిఓ ఆఫీసు ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండల బి ఆర్ ఎస్ శ్రేణులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నా నిర్వహించినారు.

# పాకిస్తాన్ కు చుక్కలు చూపించిన మహిళలు




జయభేరి, న్యూఢిల్లీ, మే 7:

పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్ (పీఓజేకే) లోని ఉగ్రవాదుల స్థావరాలపై జరిగిన దాడులను ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ సైన్యం చేపట్టినట్లు కల్నల్ సోఫియా కురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ తెలిపారు. విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీతో కలిసి సోషియా ఖురేషీ, వ్యోమికా సింగ్ మీడియా సమావేశంలో పాల్గొని ఆపరేషన్ సిందూర్ వివరాలు వెల్లడించారు. ఈ వివరాలు తెలియజేయడానికి ముందు ఉన్నస్థాయి సమావేశం జరిగింది. ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన మీడియా సమావేశంలో కల్నల్ సోఫియా ఖురేషీ మాట్లాడుతూ.. పాకిస్తాన్, పీఓకేలోని ఇతర ప్రాంతాలలో ఉన్న ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడులు చేసినట్లు వీడియో ఆధారాలు ప్రదర్శించారు.

ఆన్‌బోర్డ్ టార్గెటింగ్ సిస్టమ్స్, డ్రోన్‌ల ద్వారా సేకరించిన ఫుటేజ్ లతో లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ ఉగ్రసంస్థలకు అనుసంధానంగా ఉన్న శిబిరాలు సహా కీలక ఉగ్రవాద స్థావరాలపై ప్రత్యక్షంగా దాడులు చేసినట్లు నిర్ధారించారు. కసబ్, డేవిడ్ హెడ్లీ ట్రైనింగ్ తీసుకున్న బేస్ క్యాంపులు బద్దలయ్యాయి కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఇంటెలిజెన్స్ సాయంతో మొత్తం 21 ఉగ్రవాద స్థావరాలను గుర్తించి, వాటిలో తొమ్మిదింటిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేశాం.

మంగళవారం అర్ధరాత్రి 1.05 నుంచి 1.30 గంటల మధ్య ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. భారత్ టార్గెట్ చేసిన ఉగ్రవాదుల స్థావరాలలో 2008లో ముంబయి దాడులకు పాల్పడిన అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ శిక్షణ తీసుకున్న శిబిరం ఉందని కర్నల్ సోఫియా ఖురేషి తెలిపారు. ఇది లాహోర్‌కు 40 కిలోమీటర్ల దూరంలోని మురిద్కేలోని లష్కరే తోయిబా ఉగ్రవాద స్థావరం అని తెలిపారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఆపరేషన్ సిందూర్ ముఖ్య ఉద్దేశాన్ని వెల్లడించారు. "పహల్గాం ఉగ్రవాద దాడి బాధితులకు, వారి కుటుంబాలకు న్యాయం చేయడానికి భారత సైన్యం ఆపరేషన్ సింధూర్‌ను చేపట్టింది. 9 ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేపట్టి విజయవంతంగా ధ్వంసం చేశాం. పాక్ ప్రజలు, పాక్ ఆర్మీకి ఎలాంటి నష్టం కలగకుండా కేవలం ఉగ్రవాదుల స్థావరాలను ఎంచుకున్నామని వ్యోమికా సింగ్ తెలిపారు.

ఆపరేషన్ సింధూర్: ఉగ్రవాద స్థావరాలపై దాడులు పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సైన్యం బుధవారం తెల్లవారుజామున జైషే మహ్మద్ (జెఎం), లష్కరే తోయిబా (ఎల్ఈటీ) ఉగ్రవాద సంస్థలకు చెందిన తొమ్మిది ఉగ్రవాద లక్ష్యాలపై క్షిపణి దాడులు చేసింది.

ఏప్రిల్ 22న జరిగిన దాడిలో 25 మంది భారతీయులు, ఒక నేపాల్ టూరిస్ట్ ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. దాంతో భారత ప్రభుత్వం, ఇంటెలిజెన్స్ వర్గాలు ఉగ్రవాదుదల స్థావరాల సమచారాన్ని పక్కాగా సేకరించి దాడికి ప్లాన్ చేశాం. భారత బలగాలు బహావల్‌పూర్, సియాల్‌కోట్, భింబర్, మురిద్కే, తెహ్రా కలాన్, కోట్లి, ముజఫరాబాద్‌లలోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేశాయి.

జెఎం, ఎల్ఈటీతో పాటు హిజ్బుల్ ముజాహిదీన్ శిక్షణ శిబిరాలు, వాటి ఆపరేషనల్ బేస్‌లు ఉన్న ప్రాంతాలపై సైతం సైన్యం మెరుపు దాడి చేసి నాశనం చేసింది. అర్ధరాత్రి సరిగ్గా 1.44 గంటలకు ఈ వైమానిక దాడులు పూర్తయ్యాయని, కేవలం 23 నిమిషాల వ్యవధిలో నే ఆపరేషన్ పూర్తి చేసినట్లు రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. రక్షణ మంత్రిత్వ శాఖ పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా భారత సైన్యం ఈ చర్యలు తీసుకుందని.. అయితే ఎలాంటి పాకిస్తాన్ ఆర్మీ స్థావరాలు, పాక్ పౌరుల జోలికి వెళ్లలేదని స్పష్టం చేసింది.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి జయంతి వేడుకలు

జయభేరి, దేవరకొండ :



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ వారి నిర్వహించినారు. అమ్మవారి జయంతి సందర్భంగా కార్యక్రమాలు ఉదయం వాసవి మాత సుప్రభాతం, విగ్నేశ్వర పూజ, పంచామృత అభిషేకం (102 కలశంల చే) వాసవి మాత పారాయణం, మహిళలచే సామూహిక కుంకుమార్చన, వాసవి యజ్ఞం. హారతి మంత్రపుష్పం, సాయంత్రం వాసవి మహిళల చే కోలాటం, రాత్రి పల్లకి సేవ. అమ్మవారికి ఊయల ఉత్సవము లు ఆలయ ప్రధానార్చకులు ఘంటసాల సుబ్రహ్మణ్య శర్మ వారి శిష్య బృందం చే నిర్వహించినారు. వాసవి మాత జయంతి రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినారు. ఈ కార్యక్రమాలు గౌరవ అధ్యక్షులు పానుగంటి మల్లయ్య, అధ్యక్షులు చిదేళ్ళ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి. సముద్రాల ప్రభాకర్ కోశాధికారి. కొత్త సుబ్బారావు ఆధ్వర్యంలో వాసవి మాత జయంతి ఉత్సవాలు ఆలయ కమిటీ వారు వైభవంగా నిర్వహించినారు.

# దామోదర రాజనర్సింహకు పరిస్థితి అర్థమైందా?



జయభేరి, హైదరాబాద్, మే 7:

తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దామోదర రాజనర్సింహ, పార్టీలో జరుగుతున్న అంతర్గత సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఐక్యత లోపం, నాయకుల మధ్య విభేదాలు, బహిరంగ వివాదాలు పార్టీ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో, ఆయన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. దామోదర రాజనర్సింహ ఆందోళనకు ప్రధాన కారణం, నారాయణఖేడ్‌లో ఇటీవల జరిగిన సంఘటన. కాంగ్రెస్ నాయకులు బహిరంగ వేదికపై ఘర్షణకు దిగడం, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలోనూ వివాదాలు చోటు చేసుకోవడం ఆయనను తీవ్రంగా కలవరపెట్టింది. ఈ ఘటన పార్టీలో నాయకుల మధ్య సమన్వయ లోపాన్ని స్పష్టంగా తెలియజేసిందని ఆయన పేర్కొన్నారు. 'పార్టీ నాయకులు బహిరంగంగా కొట్టుకోవడం ఏమిటి? ఇలాంటి చర్యలు పార్టీని ఎలా కాపాడతాయి?' అని ఆయన ప్రశ్నించారు. నారాయణఖేడ్ ఘటనతో పాటు, సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులపై వస్తున్న విమర్శలు కూడా దామోదర ఆవేదనకు కారణమని తెలుస్తోంది. కొందరు నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియా వేదికల ద్వారా పార్టీ నాయకత్వంపై తమ అసంతప్తిని వెల్లడిస్తున్నారు. ఇటువంటి చర్యలు పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీస్తాయని, శత్రు పక్షాలకు ఆయుధం అందిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలం దాని స్వేచ్ఛాయుత వాతావరణమని, అదే సమయంలో అది బలహీనతగా కూడా మారుతుందని దామోదర రాజనర్సింహ సూచించారు. 'పార్టీలో అభిప్రాయ బేదాలు సహజం. ఒక నాయకుడికి మరో నాయకుడితో విభేదాలు ఉండవచ్చు.

కానీ, బహిరంగంగా వివాదాలు సష్టించడం పార్టీకి నష్టం కలిగిస్తుంది,' అని ఆయన అన్నారు. పార్టీ అంతర్గత సమస్యలను పరిష్కరించేందుకు బలమైన నాయకత్వం అవసరమని, నాయకులంతా ఒకే అజెండాతో ముందుకు సాగాలని ఆయన సూచించారుదివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డిని ఉదాహరణగా చూపుతూ, దామోదర రాజనర్సింహ నాయకులకు ఐక్యత పాఠం చెప్పారు. 'వైఎస్సార్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. అయినా, పార్టీని ఒక తాటిపై నడిపించి, అధికారంలోకి తెచ్చారు. ఆయన స్ఫూర్తిని నీతి నాయకులు అనుసరించాలి,' అని ఆయన పేర్కొన్నారు. పార్టీ ఈ రోజు అధికారంలో ఉండటం వెనుక ఎందరో నాయకులు, కార్యకర్తల త్యాగాలు ఉన్నాయని, ఆ శ్రమను గౌరవించాల్సిన బాధ్యత నాయకులపై ఉందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య విభేదాలు, వర్గాలు సహజమేనని, అయితే అవి పార్టీ నాశనానికి దారితీయకూడదని దామోదర హెచ్చరించారు. 'పార్టీలో ఎంతో మంది కీలక నాయకులు ఉన్నారు. రాజకీయ విభేదాలు తప్పవు. కానీ, అందరూ ఐక్యంగా ఉంటూ, పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడంపై దష్టి పెట్టాలి,' అని ఆయన సూచించారు. సంగారెడ్డిలో జరిగిన కాంగ్రెస్ జిల్లా నాయకుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు, ఇక్కడ ఆయన కార్యకర్తలను ఉద్దేశించి, వారి కషే నాయకుల విజయానికి కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చినప్పటికీ, అంతర్గత సవాళ్లు ఆ పార్టీని వెంటాడుతున్నాయి. నాయకుల మధ్య వర్గాలు, అసంతప్తులు, సమన్వయ లోపం వంటి సమస్యలు పార్టీ బలాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇటీవల సంగారెడ్డి డీసీసీ సమావేశంలో ఇందిరమ్మ కమిటీల్లో ప్రాధాన్యత లేకపోవడంపై నాయకులు ఘర్షణకు దిగిన ఘటన కూడా ఈ సమస్యలను మరింత స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, దామోదర రాజనర్సింహ వ్యాఖ్యలు పార్టీ నాయకులకు ఒక హెచ్చరికగా, ఐక్యతకు పిలుపుగా నిలుస్తాయి.



## ప్రణాళిక బద్ధంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- మంత్రి పొన్నం


జయభేరి, సిద్దిపేట:

ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు జిల్లా ప్రజలకు సమర్థవంతంగా అందేలా ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

బుధవారం రాష్ట్ర మంత్రి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి, కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ అనురాధ లతో కలిసి జిల్లాలో అకాల వర్షాల వల్ల పంట నష్టం, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుల ఎంపిక, వేసవి కాలం నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు, విద్యుత్ లేకుండా జాగ్రత్త చర్యలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. రాష్ట్రంలో సామాన్య వ్యక్తులకు, ప్రతి పేదవారికి అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచితంగా సన్న బియ్యం సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ కిరణం తదితర పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని అన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా పేదలలో నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అన్నారు. ప్రకృతి చర్యలను మనం ఆపలేమని ప్రకృతి వైపరీత్యాలనుండి రైతుల్ని మనం కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతులకు త్వరగా పేమెంట్ జరిగేలా చూడాలని, అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని నష్టం వివరాలను త్వరగా ప్రభుత్వానికి పంపించాలని అన్నారు. వర్షాకాలంలో నకిలీ విత్తనాలు మార్కెట్లో చలామణి కాకుండా గట్టి నిఘా ఉంచాలని అన్నారు. ఆయిల్ ఫామ్ జిల్లా రైతులకు వరమని జిల్లాలోనే ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతున్నందున వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పెద్ద రైతులను ఒప్పించి ఆయిల్ ఫామ్ పంటను పండించేలా మోటివేట్ చేసి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నేలపాలని అన్నారు. డివిజన్ల వారీగా రైతులతో ఆయిల్ ఫామ్ అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. నిర్మాణంలో ఉన్న పంచాయతీరాజ్ మరియు ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, పెయింటింగ్ వేయని అంగన్వాడీలకు సందేశాత్మకమైన మరియు పిల్లల ఆకట్టుకునే రంగుల బొమ్మలతో పెయింటింగ్ వేయాలని అన్నారు. పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షలలో 90 శాతం పైన మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించేందుకు వేదికను ఏర్పాటు చేయాలని అన్నారు. డబుల్ లైన్ రోడ్లకు ఇరు వైపులా ఈత, తాటి మరియు ఇతర పండ్లను ఇచ్చే మొక్కలను నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. త్రాగునీటికి ఇబ్బంది కలగకుండా వచ్చే వేసవికి కూడా ఇప్పుడే ప్రణాళికలు వేయాలని అన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కు బదులుగా స్టీల్ మరియు మట్టితో కూడిన బాటిల్స్, ప్లేట్లు, గ్లాసులు, కుండలను ఉపయోయించేలా ప్రజలను చైతన్యవంతం చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు, గరిమ అగ్రవాల్, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, డిఆర్డిఓ, డిఆర్ఓ, డిపిఓ, డిఈఓ, బిడబ్ల్యుఓ, డిసీఎస్ఓ, డిఎంసివిల్ సప్లై జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా హార్టికల్చర్ అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, విద్యుత్ శాఖ జిల్లా అధికారి, ఎల్డిఎం తదితరులు పాల్గొన్నారు.

# 4వ సంవత్సరీకం



**కి.శే. రాచకొండ మల్లయ్య**

మరణం: 08.05.2021

| కూతుర్లు అల్లుళ్ళు : | మనమలు. మనవరాన్లు |
|---|---|
| పున్నం శ్రీను, పున్నం కవిత | అజయ్, పల్లవి |
| కేతరాజు రమేష్, కేతరాజు కళ్యాణి | మల్లికార్జున్, రితిక |

# రాజమౌళి సినిమా తర్వాత?



ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో నటిస్తున్నారు అగ్ర హీరో మహేష్‌బాబు. రెండు షెడ్యూల్స్ పూర్తి చేసిన చిత్రబృందం ఇటీవలే కొంచెం బ్రేక్ తీసుకుంది. జూన్‌లో మరో షెడ్యూల్‌ను మొదలుపెడతారని సమాచారం. ఇదిలావుండగా రాజమౌళి సినిమా అనంతరం మహేష్‌బాబు ప్రాజెక్ట్ ఏమిటి? ఏ దర్శకుడికి ఛాన్స్ ఇవ్వబోతున్నారు? అనే విషయాలు ఆసక్తికరంగా మారాయి. తాజా సమాచారం ప్రకారం 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మహేష్‌బాబు సినిమా చేస్తారని సమాచారం. మహేష్‌బాబు 'వన్' సినిమాకు బుచ్చిబాబు సహాయ దర్శకుడిగా పనిచేశారు. అప్పటి నుంచే ఇద్దరికి సాన్నిహిత్యం ఉంది. 'ఉప్పెన' రిలీజ్ తర్వాత బుచ్చిబాబు వర్క్‌ని బాగా నచ్చడంతో 'మంచి కథ సిద్ధం చేసుకో. సినిమా చేద్దాం' అని మాటిచ్చారట మహేష్‌బాబు. ప్రస్తుతం రామ్‌చరణ్‌తో 'పెద్ది' చిత్రాన్ని చేస్తున్నాడు బుచ్చిబాబు. ఇది పూర్తయిన వెంటనే మహేష్‌బాబుతో సినిమా చేసే అవకాశం ఉందంటున్నారు. రాజమౌళిమహేష్‌బాబు సినిమా పూర్తవడానికి ఏడాదికిపైగా సమయం పడుతుందని, ఆలోగా బుచ్చిబాబు స్క్రిప్ట్‌తో సిద్ధంగా ఉంటారని ఫిల్మ్‌నగర్ టాక్. స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న 'పెద్ది' చిత్రం వచ్చే ఏడాది మార్చిలో ప్రేక్షకుల ముందుకురానుంది.



# చీరకట్టులో ఎంత ముద్దుగా ఉందో..

రెజీనా కాసాండ్రా ప్రధానంగా తెలుగు, తమిళం, కన్నడ, హిందీ చిత్రాల్లో నటిస్తుంది. ఆమె 1990 డిసెంబరు 13న చెన్నైలో జన్మించింది. ఆమె తండ్రి ముస్లిం, తల్లి క్రిస్టియన్. ఈ ముద్దుగుమ్మ తన అందంతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. రెజీనా 2005లో తమిళ చిత్రం కండా నాల్ ముదల్లో సహాయ పాత్రతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ఆమెకు 14 ఏళ్ల వయసులోనే ఈ అవకాశం దక్కింది. 2012లో శివ మనసులో శృతి చిత్రంతో తెలుగు సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. శివ మనసులో శృతి చిత్రం ఆమెకు SIIMA అవార్డ్ (ఉత్తమ తొలి నటి) తెచ్చిపెట్టింది. ఆ తర్వాత రొటీన్ లవ్ స్టోరీ, కొత్త జంట, పిల్లా నువ్వు లేని జీవితం, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ వంటి చిత్రాలతో మంచి గుర్తింపు పొందింది. తమిళంలో కేడి బిల్లా కిల్లాడి రంగా, మానగరం, విదాముయార్చి (2024) వంటి చిత్రాల్లో నటించింది. కన్నడలో సూర్యకాంతి (2010) తో ప్రారంభించింది. హిందీలో ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా (2019) మరియు జాట్ (2025) వంటి చిత్రాల్లో కనిపించింది. రెజీనా వెబ్ సిరీస్‌లలో కూడా నటిస్తూ బిజీగా ఉంది, అన్యా'స్ ట్యుటోరియల్ నటించింది. 2022లో శాకినీ డాకినీ ప్రమోషన్స్‌లో "మగవారు, మ్యాగీ రెండు నిమిషాల్లో అయిపోతారు" అని వ్యాఖ్యానించి వివాదంలో చిక్కుకుంది. దీనిని నెటిజన్లు డబుల్ మీనింగ్‌గా భావించారు. సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్‌గా ఉంటుంది.

# ఈ బ్యూటీ ఉండాల్సిందే..

సోషల్ మీడియా ప్రపంచంలో సినీతారలకు సంబంధించిన ప్రతి చిన్న విషయం క్షణాల్లో వైరలవుతుంటాయి. తాజాగా టాలీవుడ్ హీరోయిన్ చైల్డ్ హుడ్ ఫోటో ఇప్పుడు నెటిజన్స్ దృష్టిని ఆకర్షిస్తుంది. పైన ఫోటోను చూశారు కదా.. అందులో కనిపిస్తున్న చిన్నారి ఇప్పుడు తెలుగులో క్రేజీ హీరోయిన్. చిన్న వయసులోనే సినీరంగంలోకి నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ వయ్యారి.. మొదటి సినిమాతోనే నటిగా ప్రశంసలు అందుకుంది. అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను మెప్పించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అంతేకాదు.. మోస్ట్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ప్రతి సినిమాలో ఈ ముద్దుగుమ్మ ఉండాల్సిందే. మాళవిక నాయర్.. మలయాళీ ఫ్యామిలీకి చెందిన ఈ ముద్దుగుమ్మ ఢిల్లీలో జన్మించింది. కేరళ, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో చదువులు పూర్తి చేసింది. ఆ తర్వాత నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టింది. 2012లో మలయాళంలో ఓ చిత్రంలో నటించింది. ఆ తర్వాత 2015లో వచ్చిన ఎవడే సుబ్రమణ్యం సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. ఇందులో నాని, విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలు పోషించిన సంగతి తెలిసిందే. ఫస్ట్ మూవీతోనే సూపర్ హిట్ అందుకుంది మాళవిక. ఈ చిత్రానికి డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. ఇప్పటి వరకు నాగ్ అశ్విన్ మూడు సినిమాలను రూపొందించగా.. ప్రతి సినిమాలోనూ మాళవిక నాయర్ కీలక పాత్రలు పోషించింది. నాగ్ అశ్విన్ రూపొందించిన ఎవడే సుబ్రమణ్యం సినిమాతో నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు.. ఆ తర్వాత మహానటి సినిమాలో అలమేలు పాత్రలో కనిపించింది. అలాగే ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబోలో వచ్చిన కల్కి 2898 ఏడీ చిత్రంలో ఉత్తర పాత్రలో కనిపించింది. అయితే మాళవికకు ఇప్పటివరకు సరైన బ్రేక్ రాలేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ అమ్మడు చాలా యాక్టివ్‌గా ఉంటుంది.








# మెట్ గాలాలో షారుఖ్ మెరుపులు..

## స్పెషల్ ట్రిబ్యూట్ ఇచ్చిన అమూల్

బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్ ఇటీవల మెట్ గాలా వేడుకలో సందడి చేసిన విషయం తెలిసిందే. ఈ వేడుకకు హాజరైన తొలి భారతీయుడిగా షారుఖ్ రికార్డు సృష్టించాడు. అయితే షారుఖ్ మెట్ గాలాలో చేసిన సందడిపై ప్రముఖ డెయిరీ బ్రాండ్ అమూల్ తనదైన శైలిలో స్పెషల్ ట్రిబ్యూట్ ఇచ్చింది. షారుఖ్‌ను ఇండియాస్ బిగ్గెస్ట్ గాలాకార్ అంటూ ప్రశంసిస్తూ ఒక ప్రత్యేక కార్టూన్‌ను రూపొందించింది. అమూల్ రూపొందించిన ఈ కార్టూన్‌లో షారుఖ్ ఖాన్ మెట్ గాలా వేదికపై ఆకర్షణీయంగా నిలబడి ఉండగా, అమూల్ గర్ల్ ఆయనకు వెన్నతో తయారు చేసిన టోపీని అందిస్తున్నట్లుగా చిత్రీకరించారు. ఈ కార్టూన్‌ను అమూల్ తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకుంది.

ప్రస్తుత ట్రెండ్‌లో ఉన్న విషయాలతో పాటు ప్రముఖ వ్యక్తులపై అమూల్ ఎప్పటికప్పుడు తమదైన చమత్కారంతో కూడిన కార్టూన్‌లను రూపొందిస్తుంటుంది. ఈసారి మెట్ గాలాలో షారుఖ్ ఖాన్ ప్రత్యేకంగా నిలవడంతో, అమూల్ ఆయనను తమ క్రియేటివ్ ప్రమోషన్‌లో భాగం చేసింది. షారుఖ్ ఖాన్ అభిమానులు ఈ కార్టూన్‌ను విశేషంగా ఆదరిస్తున్నారు. తమ అభిమాన నటుడిని అమూల్ గౌరవించిన తీరు వారికి ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. ఈ కార్టూన్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కాగా, మెట్ గాలా అనేది ప్రతి సంవత్సరం న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్‌లో జరిగే ఒక ప్రతిష్టాత్మక ఫ్యాషన్ వేడుక. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖులు, ఫ్యాషన్ డిజైనర్లు ఈ వేడుకకు హాజరవుతారు. ఈ ఏడాది జరిగిన మెట్ గాలాలో షారుఖ్ ఖాన్ తన ప్రత్యేక శైలితో అందరి దృష్టిని ఆకర్షించారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com